కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటన



నదీమ్‌కాలనీలో ఎమ్మెల్యే కౌసర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: టోలిచౌకీ నదీమ్‌కాలనీ, శాతంచెరువు తదితర ప్రాంతాల్లో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా జహంగీర్ మసీదు నిర్వహణ కమిటీ వారు శాతం చెరువు వద్ద ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నసీరుద్దీన్, నాయకులు ఆరూస్‌ఫరాన్, ఎంజేపీ మిల్క్ ప్రొడక్ట్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్స్ మహ్మద్ గౌస్, అఫ్జల్, అజీజ్‌ఖాన్ పటాన్ తదితరులు ఉన్నారు.

సేవా పురస్కారం ప్రదానం



విజయభాస్కర్‌రెడ్డికి పురస్కారం అందజేస్తున్న భవానీరెడ్డి

గన్‌ఫౌండ్రీ: సామాజికవేత్త చిట్యాల విజయ్ భాస్కర్‌రెడ్డికి సీఎస్ఆర్ సేవా పురస్కారం లభించింది. ఈ మేరకు కళావేదికలో సీఎస్ఆర్ సౌత్ ఇండియా సమ్మిట్ కార్యక్రమంలో సోమవారం ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పరీక్ష కిట్లు, స్టడీ మెటీరియల్స్, పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నానన్నారు. తన సేవలను గుర్తించి అవార్డు అందించడం ఆనందంగా ఉందన్నారు.

ఇఫ్తార్ విందులో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



విందులో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు

గోల్కొండ: గోల్కొండ ఎండీలైన్స్‌లో మజ్లిస్ సీనియర్ నాయకుడు అబూషేర్ సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ ఉపవాస దీక్షలతో ఏకాగ్రత సాధించి క్రమ శిక్షణతో ముందుకు వెళ్దామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్, వజీఉజ్‌జమా సిద్దిఖీ తదితరులు ఉన్నారు.

‘బీసీల గుండెల్లో సీఎం రేవంత్’



విక్రం యాదవ్

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టి బీసీ బిల్లుకు ఆమోదం తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి బీసీల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంటి విక్రమ్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కీలక బిల్లులైన బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ, ఎస్సీ వర్గీకరణ, దేవాదాయ చట్ట సవరణపై బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టడం హర్షణీయమన్నారు. కేంద్రం 9వ షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించి బీసీలపై బీజేపీకి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు.

ఆస్తిపన్ను వసూళ్లపై సమీక్ష

రాజేంద్రనగర్: ఆస్తిపన్ను వసూళ్లపై రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఉప కమిషనర్ డాక్టర్ రవి కుమార్ సోమవారం సాయంత్రం ఏఎంసీ, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లు, నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ మాట్లాడుతూ.. నోటీసులు అందించిన వారి వద్దకు వెళ్లి ఆస్తి పన్ను వసూలు చేయాలని, అలాగే మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేసి వారి ఆస్తులను జప్తు చేయాలన్నారు. ప్రతిఒక్కరికీ టార్గెట్ ఇచ్చామని తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రజావాణిలో 2 ఫిర్యాదులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ దీపాలు, రెవెన్యూ విభాగానికి సంబంధించిన 2 ఫిర్యాదులు వచ్చాయని ఉప కమిషనర్ డాక్టర్ రవి కుమార్ తెలిపారు. అలాగే సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం..!



మీరాలంమండి మార్కెట్ ప్రాంతంలో అధ్వానంగా పరిసరాలు

- ఇబ్బందుల్లో రైతులు, కొనుగోలుదారులు
- పట్టించుకోని అధికారులు

చార్మినార్: పాతబస్తీలోని మీరాలంమండి కూరగాయాల మార్కెట్‌లో పారిశుద్ధ్యం పడకేసింది. ఎప్పటికప్పుడు చెత్తకుప్పలను తరలించకపోవడంతో అటు రైతులు, వ్యాపారులు, ఇటు కొనుగోలుదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. ఉదయం మాత్రమే చెత్తకుప్పలను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది తిరిగి మళ్లీ అటు వైపు చూడకపోవడంతో ఆ రోజంతా రోడ్లపైనే చెత్తకుప్పలు గుట్టలుగా పేరుకుపోయి దుర్వాసన వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా చూడాలని వారు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి..

మీరాలంమండి కూరగాయల మార్కెట్ అధ్వానంగా తయారైంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడ పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. ఎప్పటికప్పుడు చెత్తకుప్పలను తరలించకపోవడంతో గుట్టలుగా పేరుకుపోతున్నాయి. దీంతో పక్కనే ఉన్న అమ్మవారి ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లే భక్తులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైఆన జోనల్ కమిషనర్‌తో పాటు ఏఎంహెచ్‌ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలి.

– గాజుల అంజయ్య,
మీరాలంమండి గ్రేన్ అండ్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శి

జోగినీల ప్రత్యేక కమిటీ సమావేశం

నాంపల్లి: గ్రేటర్ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న జోగినీల స్థితిగతులు తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా నాంపల్లిలోని చేనేత భవన్‌లో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ అధ్యక్షతన సోమవారం ఈ కమిటీ సమావేశమైంది. సభ్యుల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అనితా రామచంద్రన్, ఐఏఎస్ శ్రీదేవి, చిక్కడపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఈఓ అన్నపూర్ణాదేవి ఉన్నారు. సమావేశానికి పలువురు జోగినీలు హాజరై తమ సమస్యలను విన్నవించారు. పెన్షన్లు, నివాస గృహాలు, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని కమిటీ సభ్యులను కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని శైలజా రామయ్యర్ హామీనిచ్చారని జోగిని రాధిక తెలిపారు. కార్యక్రమంలో జోగినీలు నిషాక్రాంతి, మేఘన యాదవ్, వాణి, పావని తదితరులు పాల్గొన్నారు.



కమిటీకి తమ సమస్యలు విన్నవిస్తున్న జోగినీలు

ఏకగ్రీవంగా ఎన్నిక



నియామక పత్రం అందుకుంటున్న వెంకటేశ్ యాదవ్

సుల్తాన్‌బజార్: జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బొప్పలి వెంకటేశ్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సమితి అధ్యక్షుడు జాతీయ యుద్ధనౌక అవార్డు గ్రహీత మేకల రాములు యాదవ్, కార్య నిర్వాహక అధ్యక్షుడు బుగిగె శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం వెంకటేశ్ యాదవ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఎన్నుకున్న కుల బంధువులకు, అలాగే బాధ్యతలు అప్పగించిన సమితి జాతీయ అధ్యక్షుడు రాములు, శ్రీనివాస్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

‘వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే గెలుపు’



మాట్లాడుతున్న జగదీశ్‌కుమార్

గోల్కొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కార్వాన్ నియోజకవర్గంలో బీజేపీదే విజయమని కార్వాన్ డివిజన్ అధ్యక్షుడు ఉద్దడి జగదీశ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. డివిజన్ స్థాయి పదాధికారులు, కార్యకర్తలతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవులు తీసుకుని పార్టీ కోసం పని చేయని వారికి గుర్తింపు ఉండదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకుడిపై ఉందన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సి.గోపాల్, ప్రధాన కార్యదర్శి కె.బాలకృష్ణ, అశోక్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

రైతులు మోతాదుకు మించి మందులు వాడొద్దు



శిక్షణలో వివిధ విశ్వవిద్యాలయాల అధ్యాపకులు

ఏజీవర్సిటీ: రైతులు మోతాదుకు మించి పురుగుల నివారణ మందులు వాడొద్దని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్ విద్యాసాగర్ పేర్కొన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ కమ్యూనిటీ సైన్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ రీసెర్చ్ సెంటర్‌లో 'మానసిక, పోషకాహార నాణ్యత, వ్యక్తి వికాసంపై ఉండే ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన శిక్షణ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. కలుషిత ఆహార పదార్థాలు, కూరగాయలు తినడం వల్లే మనిషి అనారోగ్యానికి గురవుతున్నాడని, పురుగు మందులు వాడకాన్ని తగ్గించాలన్నారు. మారుతున్న పరిస్థితుల వల్ల ప్రతి ఇంటిలోనూ మానసిక సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాల బోధన సిబ్బంది పాల్గొనగా వారందరికీ పత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్లానింగ్ సెల్ డైరెక్టర్ టి శశికళ, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ విజయలక్ష్మి, టి సుప్రజ, పి శ్రీదేవి, జానకి, శ్రీనాథ్, స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి

మణికొండ: ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం మున్సిపల్ మేనేజర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం మాట్లాడుతూ.. 'గుడ్ మార్నింగ్ మణికొండ' పేరిట పలు కాలనీల్లో కార్యక్రమం నిర్వహించి పలు సమస్యలను గుర్తించామన్నారు. పుప్పాలగూడ శ్మశానవాటికకు రోడ్డు, అంబేడ్కర్ భవన నిర్మాణం, శ్మశాన వాటికల ఏర్పాటు, మారుతీనగర్ రోడ్డు ఆక్రమణ, రెడీమిక్స్ వాహనాలు తిరగడంతో పాడైన రోడ్లు, నెమలినగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, శానిటేషన్ కార్మికులకు ఏడాదిలో 15 రోజుల సెలవులు ఇవ్వాలని, అలాగే వీధి కుక్కలకు షెల్టర్ హోం నిర్మించాలని కోరామన్నారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ధన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు ఎ.లక్ష్మణ్‌రావు, బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి, కె. రాఘవరెడ్డి, దిలీప్‌కుమార్, యాలాల కిరణ్, సుమ నళిని పాల్గొన్నారు.



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజమోహన్

దూద్ బౌలి: ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని పురానాపూల్ డివిజన్ కార్పొరేటర్ సున్నం రాజమోహన్ అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పురానాపూల్ ప్రభుత్వ అర్బన్ హెల్త్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఇన్‌చార్జి డాక్టర్ బుష్రా అంజుమ్ మాట్లాడుతూ..హైదరాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు 14 రోజుల పాటు ఇంటింటా అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేలను కాపాడుకుంటేనే ఆరోగ్యం



సదస్సులో శాస్త్రవేత్తలు, అధికారులు

ఏజీవర్సిటీ: నేలను కాపాడుకుంటేనే మనుషులు ఆరోగ్యంగా ఉంటారని, అలాగే మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని అమెరికాలోని అబర్న్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎంఎస్ రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 'దక్కన్ సొసైటీ ఆఫ్ ప్లాంట్ పెథాలజిస్ట్' ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని 'నూతన సుస్థిర వ్యవసాయం పద్ధతులు, నేలల ఆరోగ్యం' అనే అంశంపై మాట్లాడారు. భూమిలో ఉండే సేంద్రియ కార్బన్‌తో పాటు మేలు చేసే సూక్ష్మజీవుల సంతతి పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం దక్కన్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంఎస్ రెడ్డిని ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో డీన్ అఫ్ అగ్రికల్చర్ డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ రాములు, డీన్ నరేందర్ రెడ్డి, ప్లాంట్ పెథాలజిస్ట్ విద్యాసాగర్, శాస్త్రవేత్తలు త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 18,19న 25వ వార్షికోత్సవం

గౌలిపురా: ఈనెల 18,19న శ్రీరాంనగర్ కాలనీలోని శ్రీ హంపీ సంస్థానం శ్రీ బాలాజీ, అయ్యప్ప స్వామి ఆలయం 25వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు వీఎస్.గణేశ్ గురుస్వామి, పోటేల్ సదానంద్ యాదవ్ గురుస్వామి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులు జె.గణేశ్ శాస్త్రి, జె.భద్రిశాస్త్రి, ఎం.సాయిపవన్ శర్మ, ఎం.రమేశ్ శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఇందుకు సంబంధించి ఆలయంలో ఏర్పాట్లు చేశామని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశ కార్యకర్తలు

మణికొండ: ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గండిపేట తహసీల్దార్ ఎన్.శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, ప్రమోషన్లు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు శంకరమ్మ, రుక్మిణి, సులోచన, అనిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కంటి పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

గోల్కొండ: విద్యార్థులు కంటి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మెహిదీపట్నంలోని సబ్దారియా బాలికల పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ వారు అందించిన కళ్లద్దాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు టీవీ, మొబైల్స్, కంప్యూటర్, ల్యాప్‌టాప్ తదితర వాటిని ఎక్కువగా చూస్తున్నారన్నారు. దీంతో కంటి చూపు సమస్యలు వస్తున్నాయన్నారు. అంతేగాకుండా చదువుపై కూడా ఏకాగ్రత పెట్టలేమన్నారు. కంటి లోపాలను నివారించేందుకు గతేడాది ఏప్రిల్ నుంచి ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు, అదేవిధంగా సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు రెండో విడతలో అనుబంధ పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 695 ప్రభుత్వ పాఠశాలల్లో 71,309 విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి వీరిలో 8,849 విద్యార్థుల్లో వక్రీభవన లోపాలు గుర్తించామన్నారు. వారికి మళ్లీ పరీక్షలు నిర్వహించగా 7,524 మంది దృష్టి లోపాలు గుర్తించి వారికి కళ్లద్దాలు అందించామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి, డీఈఓ రోహిణి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సాయిబాబా, డాక్టర్ మురళీధర్, డీఐఓ డాక్టర్ శ్రీధర్, డీఎంఓ రాములు, అహ్మద్‌నగర్ కార్పొరేటర్ సర్ఫారాజ్ అహ్మద్, పాఠశాల కరస్పాండెంట్ ఆలీ మిర్జా, ప్రధానోపాధ్యాయురాలు బేబీజైనప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సభావట్ లక్ష్మణ్

చార్మినార్: రాష్ట్ర బడ్జెట్ లో విద్యా రంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ సభావట్ కల్యాణ్ డిమాండ్ చేశారు. సోమవారం సిటీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువస్తామని, అధిక నిధులు కేటాయించి విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తామని అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. గత బడ్జెట్ లో కేవలం 7 శాతం నిధులే కేటాయించిందని వాటిని కూడా పూర్తిగా విడుదల చేయలేదని మండిపడ్డారు. చిన్నవైన ఈశాన్య రాష్ట్రాలు సైతం వాటి బడ్జెట్లో 12–13 శాతం నిధులు కేటాయిస్తుంటే, మన రాష్ట్రంలో అరకొర నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. తెలంగాణలో 90 శాతం మంది విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులేనని, వారందరూ కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ మీదే ఆధారపడి విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. సుమారు వాటికి సంబంధించి రూ. 8,000 కోట్లు పెండింగ్ లో పెట్టి నిరుపేదలకు విద్యను దూరం చేస్తున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో సిటీ కళాశాల అధ్యక్షుడు జితేందర్, నగర కార్యదర్శి రవితేజ , విద్యార్థి సంఘం నాయకులు సంతోష్, సందీప్, అనురాధా తదితరులు పాల్గొన్నారు.

20న ఉగాది విశిష్ట పురస్కారాల ప్రదానం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆర్ఆర్ ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 20న రవీంద్రభారతిలో అంతర్జాతీయ మహిళ, ఉగాది విశిష్ట పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు శృతిలయ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి.చెన్నారెడ్డి, శాసన మండలి ప్రతిపక్ష నేత ఎస్.మధుసూధనాచారి, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావుతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశంకు ఉగాది సాహిత్య జీవన సాఫల్య పురస్కారం, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎన్‌వి.రమణారెడ్డి, నాట్య గురువు ఓలేటి రంగమణితో పాటు పలువురు ప్రముఖులకు ఉగాది విశిష్ట ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే అందాల నటుడు శోభన్‌బాబు పేరిట సినీ సంగీత విభావరి ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ టి.వెంకన్న

చార్మినార్: ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న సూచించారు. తన కార్యక్రమంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. సంతోష్‌నగర్ సర్కిల్ కి సంబంధించి అక్రమ నిర్మాణంపై ఒక ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు తమకు అందిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల సమన్వయంతో సత్వర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ రాజారావు, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి’



అవార్డులు అందజేస్తున్న సినీనటుడు సుమన్

గన్‌ఫౌండ్రీ: మహిళలకు అన్ని రంగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడే సమన్యాయం జరుగుతుందని సినీ నటుడు సుమన్ అభిప్రాయపడ్డారు. రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యామిని స్టూడియోస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే మార్షల్ ఆర్ట్స్, కరాటే వంటి ఆత్మరక్షణ క్రీడల్లో శిక్షణను ఇప్పించాలన్నారు. అనంతరం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. కార్యక్రమంలో సినీ నటి శివపార్వతి, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు ఇందిరాశోభ, ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు యామిని తదితరులు పాల్గొన్నారు.

తవ్వి.. వదిలేశారు..!

అధ్వానంగా రేతిబౌలి–రింగ్‌రోడ్డు



రింగ్‌రోడ్డు లక్ష్మీనగర్ చౌరస్తా దుస్థితి

గోల్కొండ: రేతిబౌలి నుంచి అత్తాపూర్ వెళ్లే రింగ్ రోడ్డు పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద కొన్ని రోజుల క్రితం అభివృద్ధి పనుల కోసం రోడ్డును తవ్వారు. అయితే పనులు పూర్తయినా తవ్విన రోడ్డును పూడ్చివేయలేదు. దీంతో నానల్‌నగర్ నుంచి లక్ష్మీనగర్ చౌరస్తా గుండా గుడిమల్కాపూర్, రింగ్ రోడ్డు వైపు వెళ్లే వాహనాదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.